

రేషన్ కోసం తిప్పలు

గ్రామంలో రేషన్ షాప్ లేకపోవడంతో దోమకొండ మండలంలోని సీతారాంపల్లి వాసులు ఇబ్బందిపడుతున్నారు.

- 11లో ▸



క్రషర్‌ను తొలగించాల్సిందే

గ్రామ సమీపంలోని స్టోన్ క్రషర్‌ను తొలగించాలని బిచ్కుంద మండలంలోని గోపన్‌పల్లి వాసులు డిమాండ్ చేశారు.

- 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
39.1 /24.6

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

బీసీ గురుకుల డిగ్రీ కళాశాల మంజూరు

సాక్షి, కామారెడ్డి: జిల్లాకు మహాత్మా జ్యోతీబా పూలే బీసీ గురుకుల డిగ్రీ కళాశాల మంజూరైంది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ విద్యాసంవత్సరం నుంచే కళాశాలను ప్రారంభించనున్నారు. కాలేజీకి అవసరమైన టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టులను కూడా మంజూరు చేశారు. కాగా గురుకుల కళాశాల ఎక్కడ ఏర్పాటు చేస్తారన్న విషయాన్ని వెల్లడించలేదు.

'మార్పుకోసం మహోద్యమం'



బాన్సువాడ: త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ ప్రస్తుతం ఒక కుటుంబం చేతిలో బందీ అయ్యిందని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కమల్ సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. దగాపడ్డ తెలంగాణలో మార్పు కోసం మహా ఉద్యమం చేయాల్సిన అవసరముందన్నారు. ఆయన శుక్రవారం బాన్సువాడలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, ప్రభుత్వ విద్యా సంస్థలలో నాణ్యమైన విద్యనందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యను పటిష్టం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని కోరారు. విద్యను వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ సంస్థలను నిషేధించాలని, ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నయా నిజాం పాలనకు చరమగీతం పాడాలని ప్రజలను కోరారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు కృష్ణ, శ్రీకాంత్, సాయిఅనిల్, భగత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'స్కూళ్లకు తోక పేర్లు తొలగించాలి'

కామారెడ్డి టౌన్: జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు తోక పేర్లను తొలగించకపోతే ఆయా పాఠశాలలను సీజ్ చేస్తామని డీఈవో ఎస్.రాజు శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలోని వివేకానంద, కృష్ణవేణి, కెనడి, గౌతమ్, బ్రిలియంట్ స్కూల్‌లు బీటాపర్, టాలెంట్, ఇంటర్నేషనల్, మోడల్, గ్రామర్ వంటి తోక పేర్లతో ప్రచారం చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఆ బోర్డులను తక్షణమే తొలగించాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాకేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీ లోగల హైటెక్ పబ్లిక్ స్కూల్‌కు ఎలాంటి అనుమతి లేదని, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

'నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి'



మద్నూర్: బాలికలు నాయకత్వ లక్షణాలు పెంచుకుని, అన్ని రంగాల్లో ముందుండాలని బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సవిత సూచించారు. మండలంలోని పెద్ద ఎక్లార గేటు వద్ద గల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం జిల్లా స్థాయి వాయిస్ ఫర్ గర్ల్స్ క్యాంపు నిర్వహించారు. జిల్లాలోని అన్ని బాలికల గురుకుల పాఠశాలల నుంచి 139 బాలికలు ఈ క్యాంప్‌లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సవిత మాట్లాడుతూ 30వ తేదీ వరకు క్యాంపు కొనసాగుతుందన్నారు. బాలికల సమస్యలు, మంచి ప్రవర్తన, వరకట్న సమస్యలపై పోరాటం వంటి విషయాలపై అవగాహన కల్పించారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి



నాగిరెడ్డిపేట: లింగంపల్లి వద్ద పోచారం ప్రధాన కాలువపై చేపట్టిన వంతెన, మాల్తుమ్మెద వద్ద నిర్మిస్తున్న చెక్ డ్యాం పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎల్లారెడ్డి ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం ఆయన ఆయా పనులను పరిశీలించారు. ఆయన వెంట ఇరిగేషన్ సిబ్బంది యాదగిరి, సాయిలు తదితరులు ఉన్నారు.

వడివడిగా..

- జిల్లాకేంద్రంలో సిద్ధమవుతున్న వైద్య కళాశాల
- వంద సీట్లకు అనుమతి ఇచ్చిన ఎన్‌ఎంసీ
- ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు

సాక్షి, కామారెడ్డి: జిల్లాకేంద్రంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, సిబ్బంది విధుల్లో చేరారు. ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించాల్సి ఉండడంతో కళాశాలకు అవసరమైన భవనాల నిర్మాణం, ఇతర పనులను అధికారులు వేగవంతం చేశారు.

ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ స్థలంలో ఇప్పటికే నిర్మించిన మాతా, శిశు సంరక్షణ ఆస్పత్రి భవనాన్ని మెడికల్ కాలేజీకి కేటాయించారు. అందులో కేవలం జీప్లస్ భవనం ఉండడంతో కాలేజీ నిర్వహణ కోసం మరో అంతస్తు నిర్మిస్తున్నారు. ఇప్పటికే స్లాబ్ వేసి గోడలు నిర్మించారు. ప్లాస్టరింగ్ చేయడంతో పాటు డోర్లు, కిటికీల బిగింపు, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులు చేపట్టాల్సి ఉంది. కాలేజీకి, హాస్టళ్లకు పూర్తి స్థాయి భవనాల కోసం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ స్థలాన్ని కేటాయించారు. కాగా వైద్య విద్యార్థుల వసతి కోసం ప్రైవేటు భవనాలను పరిశీలించారు. కాలేజీ భవనం అందుబాటులోకి వచ్చే లోపు హాస్టళ్లకు సంబంధించి భవనాల్లో సౌకర్యాలను కల్పించాల్సి ఉంటుంది. అందుకోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

విధుల్లో చేరిన ప్రొఫెసర్లు..

మెడికల్ కాలేజీకి ప్రిన్సిపాల్ పోస్టుతో పాటు ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్లకు సంబంధించి ఆయా పోస్టులు మంజూరయ్యాయి. ఆయా పోస్టులకు సంబంధించి వివిధ ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన వారు జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. తొమ్మిది మంది ప్రొఫెసర్లు, 26 మంది అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, నలుగురు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, ఐదుగురు సూపరింటెండెంట్‌లు విధుల్లో చేరారు. ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్ వైద్య కళాశాలకు సంబంధించిన పనులన్నింటిని దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలోనే వైద్య కళాశాలకు సంబంధించిన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని పనుల పర్యవేక్షణ జరుగుతోంది. కౌన్సెలింగ్ పూర్తయ్యేలోపు తాత్కాలిక భవనం పనులు పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



కామారెడ్డి పట్టణంలో వైద్య కళాశాల కోసం కేటాయించిన మాతా,శిశు ఆస్పత్రి భవనం

వంద సీట్లతో...

జిల్లా వైద్య కళాశాలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ వంద సీట్లకు అనుమతి ఇచ్చింది. దీంతో వంద మంది విద్యార్థులతో కళాశాలను ప్రారంభించనున్నారు. నీట్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లను భర్తీ చేస్తారు. ప్రభుత్వ కళాశాల కావడంతో అన్ని సీట్లూ కన్వీనర్ కోటాలోనే భర్తీ కానున్నాయి. కౌన్సెలింగ్ ద్వారా సీట్లు పొందిన విద్యార్థులను చేర్చుకుంటారు.

పనులు కొనసాగుతున్నాయి

కాలేజీ కోసం ఎంపిక చేసిన మాతా శిశు ఆస్పత్రి భవనం పైఅంతస్తులో పనులు కొనసాగుతున్నాయి. అలాగే వైద్యశాల కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రి భవనంలో అదనపు పడకలకు సంబంధించిన పనులు కూడా నడుస్తున్నాయి. విద్యార్థులు వచ్చే లోపు అన్ని పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, సిబ్బంది విధుల్లో చేరారు. అవసరమైన మిగతా సిబ్బందిని నియమించుకోవాల్సి ఉంది. - డాక్టర్ వెంకటేశ్వర్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్

అశోక్ సాగర్‌లో విషాద ఘటన

- సూసైడ్ స్పాట్‌గా మారిన పర్యాటక ప్రాంతం
- నాలుగు నెలల్లో పది ఘటనలు
- తాజాగా ముగ్గురు పిల్లలతో సహా అక్కాచెల్లెళ్ల ఆత్మహత్యాయత్నం
- నలుగురిని కాపాడిన స్థానికులు
- నీటిలో గల్లంతైన మూడేళ్ల బాలుడు





కన్నీరుమున్నీరవుతున్న బాధిత కుటుంబ సభ్యులు

ఖలీల్‌వాడి/ఎడపల్లి : ఆహ్లాదకరమైన వాతావరణం అందించే అశోక్ సాగర్ ఇప్పుడు సూసైడ్ స్పాట్‌గా మారింది. శుక్రవారం ఇద్దరు అక్కాచెల్లెళ్లు ముగ్గురు పిల్లలతో కలిసి ఆత్మహత్యాయత్నం చేయగా అందులో మూడేళ్ల బాలుడు గల్లంతయ్యాడు. ఈ ఘటనతో అశోక్ సాగర్ మరోసారి వార్తల్లోకి ఎక్కింది. నాలుగు నెలల్లో సుమారు పది ఘటనల వరకు ఇక్కడ జరిగాయి. ఎడపల్లి మండలం జాన్కంపేట్ పరిధిలో ఉన్న ఈ చెరువు వందేళ్ల క్రితం ఏర్పడింది. దీనిని పెద్ద చెరువుగా పిలిచేవారు. నిజామాబాద్, బోధన్ రహదారిపై చెరువు ఉండటంతో ప్రయాణికులకు ఆహ్లాదం అందించడానికి 2001లో అప్పటి కలెక్టర్ అశోక్ కుమార్ పర్యాటకంగా అభివృద్ధి చేశారు. రాక్ గార్డెన్‌తో పాటు చెరువులో బోటింగ్ పాయింట్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి జానకంపేట చెరువును అశోక్ సాగర్‌గా పిలుస్తున్నారు. ఇది నగరానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ చెరువు నుంచి 5 కిలోమీటర్ల దూరంలో అలీసాగర్ ఉద్యానవనం ఉంది. ఈ రోడ్డు బాసర పుణ్యక్షేత్రానికి వెళ్లే రహదారి కావడంతో పర్యాటకులకు పిక్‌నిక్ స్పాట్‌గా మారింది. అయితే కొంత కాలంగా అశోక్‌సాగర్ వద్ద ఆత్మహత్యల ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కుటుంబ కలహాలు, భర్త మద్యానికి బానిసై వేధింపులకు గురిచేయడంతో మహిళలు పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకున్న ఘటనలు గతంలో చోటుచేసుకున్నాయి. నిరుద్యోగులు, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న వారు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు ఉన్నాయి.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి భవశ్రీ



నలుగురిని కాపాడిన యువకులు

పోలీసుల భద్రత పెంచాలి

అశోక్ సాగర్‌లో పోలీసుల భద్రతతో పాటు బ్లూకోల్ట్స్ సిబ్బందిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఆత్మహత్యాయత్నాలకు పాల్పడే వారిని కాపాడి కౌన్సెలింగ్ ఇవ్వాలని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వేధింపులతోనే..

నగరంలోని దుబ్బ ప్రాంతానికి చెందిన అక్కాచెల్లెళ్లు అక్షయ, నిఖిత తమ ముగ్గురు పిల్లలతో కలిసి శుక్రవారం అత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అందులో అక్షయ కుమారుడు చిన్నా అలియాస్ భువనేశ్వర్ (3) నీటిలో గల్లంతయ్యాడు. అక్షయతో పాటు నిఖిత ఆమె పిల్లలు భవశ్రీ, శ్రీమాన్‌లను ఆ మార్గంలో వెళ్తున్నవారు కాపాడారు. అక్షయ వివాహం హైదరాబాద్‌కు చెందిన హేమంత్‌తో, నిఖిత వివాహం మెదక్‌కు చెందిన మహేశ్‌తో జరిగింది. కొంతకాలంగా హేమంత్, మహేష్ ఇద్దరూ కట్నంగా ఇచ్చిన ఇంటిస్థలం అమ్మి డబ్బులు తీసుకురావాలని భార్యలను వేధిస్తున్నారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం పుట్టింటికి వచ్చిన అక్కా చెల్లెళ్లు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆ సమయంలో రోడ్డు వెంట బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు దీనిని గమనించి ఘటన స్థలానికి చేరుకున్నారు. నిజామాబాద్ నెహ్రూనగర్‌కు చెందిన షేక్ హైదర్ చెరువులోకి దిగి నిఖిత, అక్షయలతోపాటు భవశ్రీ, శ్రీమాన్‌లను రక్షించాడు. మిగతా ఇద్దరు ఒడ్డున ఉండి బాధితులను బయటకు తీశారు.

ఇళ్లు కట్టాక పునాదులా?

- ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు
- డీసీసీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు
- డబుల్ బెడ్ రూం ఇళ్ల పరిశీలన



నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీసీసీ అధ్యక్షుడు

కామారెడ్డి టౌన్: ఎక్కడైనా పునాదులు కట్టిన తర్వాత ఇల్లు నిర్మిస్తారని, టేక్రియాల్‌లో ఇందుకు విరుద్ధంగా డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత ఇప్పుడు పునాదులు కడుతున్నారని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు విమర్శించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత పునాదులు కట్టడం ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం ఆయన టేక్రియాల్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంగంపల్లి వద్ద నిర్మించిన ఇళ్లను మోడల్‌గా చూపిస్తూ అన్నిచోట్లా నాసిరకంగా నిర్మించి ప్రజల్ని మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టేక్రియాల్‌లో డబుల్ బెడ్ రూం ఇళ్లను నాసిరకంగా నిర్మించారని ఆరోపించారు. ఇళ్ల నిర్మాణంలో లోపాలపై మాజీ మంత్రి షబ్బీర్‌అలీ విసిరిన సవాల్‌ను ఒప్పుకోలేక ఇప్పుడు ఆగమేఘాల మీద పైపై మెరుగులు దిద్దుతున్నారని విమర్శించారు. నాసిరకం నిర్మాణాలు చేపట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యతలోపంతో ఉన్న ఇళ్లను పూర్తిగా తొలగించి, కాంట్రాక్టర్ నుంచి డబ్బులు రికవరీ చేసి నూతన ఇళ్లను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కడెం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బల్దియా కాంట్రాక్టర్‌పై కేసు

కామారెడ్డి టౌన్: టెండరు దక్కించుకుని పనులు ప్రారంభించకుండా కాలయాపన చేస్తున్న కామారెడ్డి మున్సిపల్ కాంట్రాక్టర్‌పై కేసు నమోదైంది. పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి బల్దియా పరిధిలోని పెద్ద చెరువు వద్దనున్న డీఆర్‌సీసీ సెంటర్‌కు 315 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం టెండర్లు పిలవగా.. కరీంనగర్‌కు చెందిన శ్రీ సాయి ఎలక్ట్రికల్ వర్క్స్ యజమాని తిరుపతి పనులను దక్కించుకున్నాడు. టెండర్ షరతుల ప్రకారం బల్దియా ముందస్తుగానే రూ. 14.99 లక్షల చెక్కును అతడికి అందించింది. అయినా పనులు ప్రారంభించకపోవడమే కాకుండా మూడు నెలలుగా మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్‌లు ఫోన్‌లు చేస్తున్నా స్పందించడం లేదు. పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చినా ఫలితం లేదు. దీంతో మున్సిపల్ కమిషనర్ దేవేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఎల్‌ఏడీసీఎస్ కార్యాలయం ప్రారంభం



కామారెడ్డి టౌన్: జిల్లా కోర్టులో శుక్రవారం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం కార్యాలయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలకు న్యాయ సహాయాన్ని సమర్థవంతంగా అందించడానికి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. క్రిమినల్ విషయాలలో న్యాయ సహాయం అందించడానికి ఈ సిస్టం దోహదపడుతుందన్నారు. అనుభవజ్ఞులైన న్యాయవాదుల ద్వారా పేదలకు సకాలంలో న్యాయ సహాయం అందేలా చూస్తామన్నారు. లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్‌గా బి.రమేష్ చందు, కె.మోహన్‌రావు, పల్లె చి రంజీవి నియమితులయ్యారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి టి.భార్గవి, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, సబ్ జైలు సూపరింటెండెంట్ శ్రీధర్, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పర్యవేక్షకులు చంద్రసేనరెడ్డి, న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టుకు నిప్పు.. తప్పిన ముప్పు



కూలిన చెట్టును పొక్లెయిన్‌తో తొలగిస్తున్న దృశ్యం

నాగిరెడ్డిపేట: మెల్లకుంటతండా సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు చెట్టుకు నిప్పుపెట్టడంతో అది పూర్తిగా కాలిపోయి శుక్రవారం సాయంత్రం బోధన్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై కూలింది. దీంతో కొద్దిసేపు ప్రధాన రహదారిపై రాకపోకలకు అంతరాయం కలిగింది. చెట్టు కూలిన సమయంలో రహదారిపై వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. అదే సమయంలో ఎల్లారెడ్డి వైపు వెళ్తున్న నాగిరెడ్డిపేట ఎస్సై ఆంజనేయులు కూలిన చెట్టుకు గమనించి పొక్లెయిన్‌తో దానిని తొలగించారు. అనంతరం స్తంభించిన ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

పల్లెల్లో మినీ లైబ్రరీలు

- 25 గ్రామాలకు పౌర పఠన మందిరాలు మంజూరు
- ఒక్కో సెంటర్‌కు రూ.62 వేల చొప్పున కేటాయింపు



పోచారంలో ఏర్పాటు చేసిన పౌర పఠన మందిరం

నాగిరెడ్డిపేట: పౌర పఠన మందిరాల పేరుతో విజ్ఞాన భాండాగారాలను పల్లె ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగులు, పుస్తక ప్రియులకు మేలు చేకూరుతుందని భావిస్తున్నారు.

జిల్లాలో 25 గ్రామాలకు పౌర పఠన మందిరాలు(పబ్లిక్ రీడింగ్ రూం) మంజూరయ్యాయి. ప్రస్తుతం 23 గ్రామాలలో వీటిని ప్రారంభించారు. మరో రెండు గ్రామాలల్లో త్వరలోనే ప్రారంభించనున్నట్లు గ్రంథాలయ సంస్థ అధికారులు తెలిపారు. ఒక్కో రీడింగ్‌రూమ్‌కు జిల్లా గ్రంథాలయ సంస్థ ద్వారా రూ.62 వేలు మంజూరయ్యాయి. ఇందులో రూ.50 వేల విలువ గల ఫర్నిచర్, వివిధ రకాల పుస్తకాలకు, మరో రూ.12 వేలు పఠన మందిరాల ఏర్పాటు కోసం కేటాయించారు. జిల్లాలోని పౌర పఠన మందిరాలకు అవసరమైన పుస్తకాలు, ఫర్నిచర్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ ద్వారా అందజేశారు. కాగా పఠన మందిరాల ఏర్పాటుకు కేటాయించిన రూ.12 వేలు గ్రంథాలయ సంస్థ నుంచి విడుదలైనప్పటికీ ఇంకా గ్రామపంచాయతీలకు చేరలేదు. కాగా రీడింగ్ రూం నిర్వహణ కోసం గ్రంథాలయ సంస్థ ప్రతి నెలా రూ. 2 వేల చొప్పున చెల్లించనుంది. వెయ్యి రూపాయలతో దినపత్రికలు అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. పఠన మందిరం నిర్వహించే వారికి గౌరవ వేతనంగా వెయ్యి రూపాయలు ఇస్తారు. రీడింగ్ రూం నిర్వహణ బాధ్యతను గ్రామ పంచాయతీలకు అప్పగించారు.

దిన పత్రికలతోపాటు...

పౌర పఠన మందిరాలలో దినపత్రికలతోపాటు చరిత్ర, వర్తమాన అంశాలతో కూడిన ఎన్నో పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నారు. విద్యార్థులలో పఠనాసక్తి, విజ్ఞానాన్ని పెంపొందించడంలో ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని భావిస్తున్నారు. విద్యార్థులతోపాటు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నవారికి సైతం ఈ మందిరాలు చక్కగా ఉపయోగపడతాయని ఆశిస్తున్నారు.



పఠన మందిరంలో ఏర్పాటు చేసిన ఫర్నిచర్

జిల్లాలో పౌర పఠన మందిరాలు ఏర్పాటుచేసిన గ్రామాల వివరాలు

మండలం	గ్రామాలు	మండలం	గ్రామాలు
కామారెడ్డి	లింగంపల్లి, గర్గుల్	నాగిరెడ్డిపేట	పోచారం, ఆత్మకూర్
మాచారెడ్డి	ఇసాయిపేట	రామారెడ్డి	పోసానిపేట, రెడ్డిపేట
పాల్వంచ	పాల్వంచ	ఎల్లారెడ్డి	కళ్యాణి
రాజంపేట	కొండాపూర్	సదాశివనగర్	భూంపల్లి
దోమకొండ	సంగమేశ్వర్	బాన్సువాడ	హన్మాజీపేట్, బోర్లం
భిక్కనూరు	జంగంపల్లి	జుక్కల్	పెద్ద ఏడ్గి
లింగంపేట	మోతె, ముంబోజీపేట తండా	నిజాంసాగర్	మహ్మద్‌నగర్, గోర్గల్
తాడ్వాయి	ఎర్రాపహాడ్	మద్నూర్	చిన్న శక్కర్గ, మేనూర్
గాంధారి	పేట్‌సంగెం, చద్మల్‌తండా		

న్యూస్ పేపర్ చదువుతున్నాం



మా గ్రామంలోని స్కూల్ పక్కన ఏర్పాటు చేసిన పౌర పఠన మందిరం చాలా బాగుంది. రోజూ ఉదయం స్కూల్‌కు తొందరగా వచ్చి కొద్దిసేపు న్యూస్‌పేపర్లు చూస్తున్నాం. పుస్తకాలు కూడా చదువుతున్నాం.

– సత్యబోయిన శిల్ప, విద్యార్థిని, పోచారం

ఎన్నో పుస్తకాలున్నాయి



మినీ లైబ్రరీలో న్యూస్‌పేపర్లతోపాటు వివిధ రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచారు. మా టీచర్లు అందులో ఉన్న పుస్తకాల గురించి చెబుతున్నారు. రోజూ కొద్దిసేపు అక్కడికి వెళ్లి పుస్తకాలను చదువుతున్నాం.

– మేకల పల్లవి, విద్యార్థిని, పోచారం

గ్రామీణులకు ఉపయోగపడేలా...

గ్రామీణప్రాంత ప్రజలకు ఉపయోగపడేలా జిల్లాలోని 25 గ్రామాలలో పౌర పఠన మందిరాలను ఏర్పాటు చేస్తున్నాం. దినపత్రికలతోపాటు పోటీపరీక్షలకు సంబంధించిన ఎన్నో పుస్తకాలను అందుబాటులో ఉంచాం. రీడింగ్ రూమ్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– బుగ్గారెడ్డి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, కామారెడ్డి

క్లుప్తంగా

డిగ్రీ పరీక్షలు వాయిదా

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ 2వ, 4వ, 6వ సెమిస్టర్ రెగ్యులర్, 1వ, 3వ, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షలను విద్యార్థుల వినతి మేరకు వాయిదా వేస్తున్నట్లు కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 30 నుంచి ప్రారంభం కావాల్సిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు సీపీజీఈటీ–2023 ప్రవేశ పరీక్ష దృష్ట్యా వాయిదా వేశామని, ఈ పరీక్షలను జూలై 11 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పీజీ పరీక్షలు..

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులకు సంబంధించి 8వ, 10వ సెమిస్టరు రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు వాయిదా వేసినట్లు కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 4 నుంచి 14వరకు జరగాల్సిన పరీక్షలను సీపీజీఈటీ –2023 ప్రవేశ పరీక్ష దృష్ట్యా వాయిదా వేసినట్లు తెలిపారు. తిరిగి పరీక్షలు నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని, సంబంధిత విద్యార్థులు ఈ విషయం గమనించాలన్నారు.

డిగ్రీ ప్రాక్టికల్స్ పరీక్ష తేదీల్లో మార్పులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ 2వ, 4వ, 6వ సెమిస్టర్ రెగ్యులర్ ప్రాక్టికల్ పరీక్షల తేదీల్లో మార్పులు చేసినట్లు కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు సెట్–1, గ్రూప్– ఏకు సంబంధించిన కళాశాలల్లో జూలై 18 నుంచి 23 వరకు జరుగుతాయన్నారు. గ్రూప్– బీ కి సంబంధించిన కళాశాలల్లో జూలై 26 నుంచి ఆగస్టు 1 వరకు జరుగుతాయన్నారు. స్టాటిస్టిక్స్ ప్రాక్టికల్ / ప్రాజెక్టు ఎగ్జామినేషన్ పరీక్ష సెట్–2 లో గ్రూప్– ఏ కు సంబంధించిన కళాశాలల్లో జూలై 24, 25వ తేదీల్లో జరుగుతాయని తెలిపారు. గ్రూప్–బి కళాశాలల్లో ఆగస్టు 2, 3వ తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో శుక్రవారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 1,149 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్ అరుణ తెలిపారు. ఉదయం జరిగిన 4వ సెమిస్టర్ రెగ్యులర్, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాక్ పరీక్షలకు 7,315మంది విద్యార్థులకు 6,690 మంది, మధ్యాహ్నం జరిగిన 2వ, 3వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు 10,006 మంది విద్యార్థులకు 9,182 మంది హాజరైనట్లు ఆమె పేర్కొన్నారు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఐదుగురు విద్యార్థులు డిబార్ అయ్యారని తెలిపారు.

27న నిధి ఆప్కే నికట్

నిజామాబాద్ సిటీ: భీమ్‌గల్, కామారెడ్డి పట్టణాలలో ఈ నెలా 27న నిధి ఆప్కే నికట్ 2.0(మీ ఇంటి వద్దకు ఈపీఎఫ్‌ఓ) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ సహాయక కమిషనర్ మధుసూదనాచారి ఒక ప్రకటనలో తెలిపారు. భీమ్‌గల్ మున్సిపాలిటీ కార్యాలయంలో పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ సిహెచ్‌వీ శ్రావణ్‌కుమార్, కామారెడ్డి జిల్లా కేంద్రం సిరిసిల్ల రోడ్డు దేశాయ్ బ్రదర్స్ లిమిటెడ్ కంపనీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎస్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. పీఎఫ్ చందాదారులు, యజమానులు, పెన్షనర్లు తగిన ఆధారాలతో హాజరు కావాలని కోరారు. ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరిస్తామన్ననారు.

‘మైత్రి’ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో ఖాళీగా ఉన్న ‘మైత్రి’ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పశుగణాభివృద్ధి సంఘం కార్యనిర్వహణ అధికారి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. కోటగిరి మండలంలోని రాంపూర్, ఎడపల్లిలోని జాన్కంపేట్, బాల్కొండలోని బుస్సాపూర్, భీమ్‌గల్‌లోని సికింద్రాపూర్, జక్రాన్‌పల్లిలోని మునిపల్లి, ధర్పల్లిలో దుబ్బాక, ఇందల్వాయిలోని ఎల్లారెడ్డిపల్లి, బోధన్‌లోని నర్సాపూర్, నందిపేట్‌లోని అన్నారం మైత్రి కేంద్రాల్లో పని చేయాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు స్థానికులై, పదవ తరగతి పాసై ఉండాలన్నారు. ఈ నెల 30లోగా జిల్లా కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

స్టోన్ క్రషర్‌ను తొలగించాల్సిందే..

- కొత్తగా అనుమతులు వద్దు
- గూపన్‌పల్లి గ్రామస్తుల డిమాండ్
- అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటాం :అడిషనల్ కలెక్టర్ ధోత్రే





మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, నకిలీ సామాజిక కార్యకర్తలను నిలదీస్తున్న గ్రామస్తులు

బిచ్కుంద: తమ గ్రామ సమీపంలోని స్టోన్ క్రషర్‌ను తొలగించాలని, కొత్తగా ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని బిచ్కుంద మండలంలోని గోపన్‌పల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామ సమీపంలో సుమారుగా ఏడేళ్లుగా ఎల్లయ్య అండ్ సన్స్ స్టోన్ క్రషర్, డాంబర్ మిక్సింగ్ ప్లాంట్ కొనసాగుతోంది. అది ప్రస్తుతం ఐదు హెక్టార్లలో ఉంది. తొమ్మిది హెక్టార్లలో క్రషర్ నిర్వాహణకు అనుమతి కోరుతూ యాజమాన్యం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకొంది. దీంతో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ శుక్రవారం గ్రామానికి వచ్చారు. గ్రామస్తులతో సమావేశమై చర్చించారు. అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుంటామని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అదనపు వెంకటేశ్ ధోత్రె అన్నారు. దీంతో గ్రామస్తులు మాట్లాడుతూ.. స్టోన్ క్రషర్‌తో బ్లాస్టింగ్, అనుమతి లేని డాంబర్ మిక్సింగ్ ప్లాంట్‌తో కాలుష్యం పెరిగిపోయి గ్రామంలో ఐదుగురు వ్యక్తులు క్యాన్సర్‌తో మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరు శ్వాస సంబంధ వ్యాధులతో బాధ పడుతున్నారని చెప్పారు. గ్రామానికి ఆరు వంద మీటర్ల దూరంలో క్రషర్, మిక్సింగ్ ప్లాంట్ ఉన్నాయని, వీటిని తొలగించాలని గతంలో కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదులు చేశామన్నారు. తిరిగి రెండోసారి అనుమతి ఇవ్వమమని, తొలగిస్తామని అధికారులు, క్రషర్ నిర్వాహకులు హామీ ఇచ్చారని గ్రామస్తులు అడిషనల్ కలెక్టర్‌కు తెలిపారు. క్రషర్‌ను తొలగించాలని ప్రాణత్యాగాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని గ్రామస్తులు పేర్కొన్నారు. అనుమతి రద్దు చేసే వరకు రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. ప్లాంట్ తమ ప్రాణాలను తీస్తోందని, మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించి ప్లాంట్ తొలగించే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

నకిలీ సామాజిక కార్యకర్తల నిలదీత

ప్రజాభిప్రాయ సేకరణలో నకిలీ సామాజిక కార్యకర్తలు క్రషర్‌తో పర్యావరణానికి ముప్పు లేదని, అనుమతికి అనుకూలంగా అభిప్రాయాలు ఇచ్చారు. దీంతో గ్రామ యువకులు వారిని పట్టుకొని నిలదీశారు. అందులో కొందరు నకిలీ జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తల పేరుతో చెలామణి అవుతున్న వారు ఉన్నారు. వారిని క్రషర్ నిర్వాహకుడు తీసుకొచ్చారు. దీంతో కొంత సేపు ప్రజాభిప్రాయ సేకరణలో గందరగోళం ఏర్పడింది. అక్కడి నుంచి వారు కార్లలో పారిపోయే యత్నం చేయగా యువకులు అడ్డుకున్నారు. నకిలీ సామాజిక కార్యకర్తల అభిప్రాయాలను వీడియోలో నుంచి తొలగించాలని పట్టుబట్టారు.అధికారులు, ఎస్సై శ్రీధర్‌రెడ్డి సముదాయించడంతో యువకులు శాంతించి కార్లను వదిలేశారు. గ్రామస్తులు తెలియజేసిన అభిప్రాయాలు, వినతులను పర్యావరణ పరిరక్షణ రాష్ట్ర కమిటీ, సంబంధిత శాఖా అధికారులకు నివేదిక పంపించి అందరికి న్యాయం చేస్తామని అదనపు కలెక్టర్ హామీనిచ్చారు. మైనింగ్, పర్యావరణ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో చనిపోతున్నారు



స్టోన్ క్రషర్, డాంబర్ మిక్సింగ్ ప్లాంట్ మా గ్రామానికి ఆరు వందల మీటర్ల దూరంలో ఉంది. పొగ, దుమ్ము, బ్లాస్టింగ్‌లతో ప్రజలు అనారోగ్యం బారిన పడి చనిపోతున్నారు. ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయి. అనుమతి ఇవ్వవద్దని కోరుతున్నాము. అనుమతి ఇస్తే గ్రామ ప్రజల సూచనల మేరకు రిలే నిరాహార దీక్షలు చేస్తాం. – శ్రీనివాస్, సర్పంచ్ గోపన్‌పల్లి

కార్మికులకు కనీస వేతనాలు అందించండి



సమావేశంలో మాట్లాడుతున్న దండి వెంకట్

నిజామాబాద్‌నాగారం: వాటర్ సప్లయ్, గార్డెన్స్, స్ట్రీట్ లైట్స్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని బీఎల్‌టీయు రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహంలో శుక్రవారం మున్సిపల్ వాటర్ సప్లయ్, గార్డెన్స్, స్ట్రీట్ లైట్స్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమావేశం జరిగింది. కార్యక్రమంలో దండి వెంకట్ పాల్గొని, మాట్లాడారు. నగరంలో నిత్యం పారిశుద్ధ్యం, మంచి నీళ్ల అందించడానికి, ప్రజల శ్రేయస్సు కోసం మున్సిపల్ కార్మికులు ఎంతో పనిచేస్తున్నారన్నారు. అయినా వారికి సరైన వేతనాలు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై త్వరలో ఆందోళన చేస్తామన్నారు. బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి మేకల రాజేందర్, బీఎల్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కాంబ్లే మధు, నగర అధ్యక్ష, కార్యదర్శులు గంగా శంకర్, యాదయ్య, నాయకులు రాహుల్, హరీష్, మురళి, వసంత్, శ్రీశైలం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలని కామారెడ్డి అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఏపీడీ) మురళీకృష్ణ సూచించారు. డిచ్‌పల్లిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ)లో శుక్రవారం కామారెడ్డి జిల్లాకు చెందిన 70మంది ఐకేపీ సీఏలకు ఆర్థిక అక్షరాస్యత శిక్షణ (ఎఫ్‌ఎల్‌సీఆర్‌పీ) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణను సద్వినియోగం చేసుకుని, గ్రామ సంఘ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. సెర్ప్ ప్రతినిధి వెంకట్, సంస్థ డైరక్టర్ సుంకం శ్రీనివాస్, సిబ్బంది భాగ్యలక్ష్మీ, రామకృష్ణ, రంజిత్, నవీన్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి



ఘటన స్థలంలో రాజమ్మ మృతదేహం

మోపాల్: మోపాల్‌లోని ఎల్లమ్మ ఆలయం వద్ద శుక్రవారం ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఒడ్డెర కాలనీకి చెందిన ఎత్తరి రాజమ్మ (60) మృతి చెందిందని ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నర్సింగ్‌పల్లి వైపు నుంచి ఆటో నిజామాబాద్‌కు వెళ్తుండగా, అదేసమయంలో మోపాల్‌కు చెందిన చంద్రయ్య బైక్‌పై సర్వీస్ రోడ్డు నుంచి ప్రధాన రహదారి వైపు వస్తున్నాడు. ఈక్రమంలో ఆటో అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఒడ్డెర కాలనీకి చెందిన ఎత్తరి రాజమ్మకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ఆటో డ్రైవర్ మన్మధ, అఖిల్ పాష, పోచవ్వతోపాటు చంద్రయ్యకు గాయాలయ్యాయి. మృతురాలి కోడలు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

బైక్ అదుపు తప్పి మహారాష్ట్ర వాసి..

మద్నూర్: మద్నూర్ సమీపంలో జాతీయ రహదారి 161పై బైక్ అదుపు తప్పి మహారాష్ట్రలోని దేగ్లూర్‌కు చెందిన పవన్(38) మృతి చెందినట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. వివరాలు.. దేగ్లూర్‌కు చెందిన పవన్, శ్యామ్ ఇద్దరు గురువారం సాయంత్రం మద్నూర్ మండలంలోని రూసేగావ్ గ్రామంలో ఉన్న తెలిసిన వారి దగ్గరికి బైక్‌పై వచ్చారు. అదే రోజు రాత్రి దేగ్లూర్‌కు వెళ్తుండగా మద్నూర్ సమీపంలో జాతీయ రహదారిపై గల డివైడర్‌ను ఢీకొన్నారు. ప్రమాదంలో తీవ్రగాయాలైన ఇద్దరిని ఆస్పత్రికి తరలిస్తుండగా పవన్ మృతి చెందాడు. శ్యామ్‌ను ఆస్పత్రికి తరలించామన్నారు.

చెరువులో మునిగి వృద్ధుడు..



హన్మండ్లు (ఫైల్)

మోపాల్: నగర శివారులోని బోర్గాం(పి)కి చెందిన కోంద్ర హన్మండ్లు (62) మండలంలోని కంజర్ చెరువులో మునిగి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో మహేష్ శుక్రవారం తెలిపారు. వివరాలు.. హన్మండ్లుకు కంజర్ గ్రామశివారులో వ్యవసాయ భూమి ఉంది. ఈ నెల 21న ఉదయం 8 గంటల సమయంలో అక్కడికి వెళ్లిన హన్మండ్లు కాలకృత్యాలకు అని చెరువులోకి దిగాడు. ప్రమాదవశాత్తు కాలు జారి వలకు చిక్కుకుని అందులోనే మునిగిపోయాడు. శుక్రవారం ఉదయం మృతదేహం పైకి తేలడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడి భార్య యమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



భూమేష్ (ఫైల్)

సిరికొండ: బహ్రెయిన్‌లో గుండెపోటుతో మృతి చెందిన వ్యక్తి మృతదేహం శుక్రవారం స్వగ్రామానికి చేరింది. న్యావనంది గ్రామానికి చెందిన మగ్గిడి భూమేశ్వర్(46)కు భార్య కమల, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. భూమేశ్వర్ ఉపాధి నిమిత్తం బహ్రెయిన్ వెళ్లారు. అక్కడ విధుల్లో ఉండగా ఈనెల 4న గుండెపోటు వచ్చింది. ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతి చెందాడు. ఆయన పాస్‌పోర్టులో వివరాలు కొన్ని తప్పుగా నమోదవడంతో మృతదేహం స్వదేశానికి తీసుకు రావడానికి ఇబ్బందులు తలెత్తాయి. దీంతో స్థానిక సర్పంచ్ శ్రీనివాస్ సమస్యను ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన రాష్ట్ర చీఫ్ సెక్రెటరీతో మాట్లాడి మృతదేహం స్వదేశానికి వచ్చేలా కృషి చేశారని సర్పంచ్ తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు బహ్రెయిన్‌లో కంపెనీ నిర్వాహకుడు, ఇండియన్ క్లబ్ సభ్యుడైన గ్రామానికి చెందిన బొందెల సురేష్, రాజేశ్వర్ కూడా తమకు సహకారం అందించినట్లు గ్రామస్తులు తెలిపారు.

మంజీరలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

నాగిరెడ్డిపేట: మండలంలోని గోలిలింగాల శివారులో గల మంజీరలో గురువారం గల్లంతైన యువకుడి మృతదేహం శుక్రవారం లభ్యమయింది. మండలంలోని వాడి గ్రామానికి చెందిన బాలలింగం ఏసు(22) గురువారం గోలిలింగాల సమీపంలోని మంజీర నదిలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతైన విషయం తెలిసిందే. స్థానికులు గురువారం రాత్రి వరకు నదిలో గాలింపు చర్యలు చేపట్టినా ఏసు జాడ లభ్యం కాలేదు. కాగా శుక్రవారం ఉదయం ఏసు మృతదేహం నది ఒడ్డున తేలింది. మృతుడి తండ్రి సిద్ధయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

నాగిరెడ్డిపేట: మండలంలోని అక్కంపల్లి శివారులో పేకాట స్థావరంపై శుక్రవారం స్థానిక పోలీసులు దాడిచేసి ఐదుగురిని అరెస్టు చేశారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వారి నుంచి రూ.9,640 స్వాధీనం చేసుకున్నామన్నారు.

శిలాఫలకంపై పోస్టర్లు అతికించిన కంపెనీపై కేసు

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ, మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ సంస్థలు, శిలాఫలకాలపై పోస్టర్‌లు అంటించిన వారిపై చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్ శుక్రవారం తెలిపారు. మున్సిపల్ కమిషనర్ దేవేందర్ ఫిర్యాదు మేరకు పట్టణంలోని ఇందిరాచౌక్ వద్ద శిలాఫలకంపై సమ్మర్ ఉద్యోగాల పేరుతో పోస్టర్లు అతికించిన ఇండియన్ గ్రూప్ ఆఫ్ కంపెనీపై కేసు నమోదు చేశామన్నారు.

ఆకుల కొండూర్ సర్పంచ్‌పై..

నిజామాబాద్ సిటీ: ఇరిగేషన్ అధికారిణి విధులకు ఆటంకం కలిగించిన నిజామాబాద్ రూరల్ మండలం ఆకుల కొండూర్ సర్పంచ్ అశోక్‌కుమార్, మరికొంత మంది గ్రామస్తులపై కేసు నమోదు చేసినట్లు శుక్రవారం ఎస్సై లింబాద్రి తెలిపారు. గ్రామంలో మహాలక్ష్మీ మాతా మందిరం నిర్మాణం జరుగుతోంది. బరంతి కొరకు మట్టి అవసరం ఉండటంతో గ్రామ సమీపం చెరువులో నుంచి తరలించారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఏఈ రాజ్యలక్ష్మి గురువారం సాయంత్రం వెళ్లి మట్టి తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. సర్పంచ్ అశోక్‌కుమార్, కొంతమంది గ్రామస్తులు పనులు ఆపవద్దని ఏఈని దుర్భాషలాడుతూ విధులకు ఆటంకం కలిగించారు. ఈ విషయమై ఆమె శుక్రవారం ఉద్యోగులకు చెప్పటంతో వారంతా కలిసి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. కలెక్టర్ లేక పోవటంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సర్పంచ్ అశోక్‌కుమార్‌తో పాటు మరికొంతమందిపై ఫిర్యాదు చేయగా కేసు చేసినట్లు ఎస్సై తెలిపారు. గతంలో కూడా రైస్‌మిల్లులో నుంచి పీడీఎస్ బియ్యాన్ని సర్పంచ్ తీసుకెళ్లటంతో కేసు నమోదు అయింది.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి రెండు రోజుల జైలు

కామారెడ్డి క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. ఈనెల 16న దేవునిపల్లి పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా పట్టణానికి చెందిన కల్యాణ్ డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. అతడిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్ష, రూ. 200 జరిమానా విధించినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

- టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్



మాట్లాడుతున్న అలుక కిషన్

సుభాష్‌నగర్: ఉద్యోగులకు గుదిబండగా మారిన సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సీఎం కేసీఆర్‌తోనే ఇది సాధ్యమని ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ అన్నారు. శుక్రవారం నగరంలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు 2 డీఏలు ఇవ్వాలని, వెంటనే మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌ను పకడ్బందీగా అమల్జేయాలని, సాధారణ బదిలీలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల భద్రతే టీఎన్‌జీవో ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కార్యాచరణ మేరకు దశాబ్ది ఉత్సవాలను ఉద్యోగులు, ప్రజలు, ప్రజాప్రతినిధులందరూ విజయవంతం చేసినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాల్లో ఉద్యోగులు ప్రముఖ పాత్ర పోషించారని గుర్తు చేశారు. జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, సహాధ్యక్షుడు చిట్టి నారాయణరెడ్డి, అమృత్‌కుమార్, ఆకుల ప్రసాద్, పోల శ్రీనివాస్, సుమన్, జాఫర్ హుస్సేన్, నటరాజ్ గౌడ్, ఉమాకిరణ్, అజ్మీరా రాంజీ, గొండ స్వామి పాల్గొన్నారు.

విద్యారంగంలో మార్పు కోసం పోరాడాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): ఎందరో విద్యార్థుల ఆత్మబలిదానాలతో సాధించుకున్న రాష్ట్రంలో విద్యారంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ జీవన్ అన్నారు. శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీలో ‘దగాపడ్డ తెలంగాణలో మార్పు కోసం- మహా ఉద్యమం’ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీవన్ మాట్లాడుతూ.. విద్యారంగంలో మార్పు కోసం విద్యార్థులు కలిసికట్టుగా మహోద్యమం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏబీవీపీ నాయకులు నవీన్, ప్రమోద్, సాయికృష్ణ, సింహాద్రి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ అక్రమాలపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న సంతోష్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో 2022–23లో జరిగిన పీహెచ్‌డీ అక్రమాలపై విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ యూనివర్సిటీ అధ్యక్షుడు సంతోష్ డిమాండ్ చేశారు. శుక్రవారం తెయూ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీహెచ్‌డీ అడ్మిషన్లు, డాక్టరేట్ పట్టాల ప్రదానం విషయమై తెయూ పాలకమండలి సమావేశంలో చేసిన తీర్మానంపై విచారణ జరిపించడంలో వర్సిటీ ఉన్నతాధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈసీ మీటింగ్ ఏకగ్రీవ తీర్మానం చేసి సుమారు నెలరోజులు కావస్తున్నా ఇంతవరకు విచారణ ప్రారంభించక పోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. నాయకులు అక్షయ్,భరత్‌చంద్ర,రణధీర్ పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: దేశ విభజన, బెంగాల్ విభజనతో పాటు కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి హోదా కల్పించే ఆర్టికల్ 370ని డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య పేర్కొన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా బస్వా లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ.. శ్యామాప్రసాద్ ముఖర్జీ కలలుగన్న ఒకే దేశం, ఒకే ప్రధాని, ఒకే రాజ్యాంగాన్ని ప్రధాని మోదీ అమలు జేస్తున్నారని, ఆర్టికల్ 370ని రద్దు చేశారని గుర్తుచేశారు. నాయకులు, కార్పొరేటర్లు న్యాలం రాజు, లక్ష్మీనారాయణ, గోపిడి స్రవంతిరెడ్డి, పంచరెడ్డి ప్రవళిక, ఇప్పకాయల కిషోర్, దొంతుల రవి, బద్దం కిషన్, నారాయణ యాదవ్, శీల శ్రీనివాస్, రాకేష్, శంకర్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

విక్రయాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



మాట్లాడుతున్న రూరల్ ఏడీఏ ప్రదీప్‌కుమార్

సిరికొండ: ఎరువులు, విత్తనాల విక్రయాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని నిజామాబాద్ రూరల్ ఏడీఏ ప్రదీప్‌కుమార్ డీలర్లను ఆదేశించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ఎరువులు, విత్తనాలు పురుగు మందుల డీలర్లతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ.. నూతనంగా ప్రవేశపెట్టిన ఓఎల్‌ఎంఎస్ సిస్టంలో డీలర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే ప్రక్రియ గురించి అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేష్, డీలర్లు పాల్గొన్నారు.

‘కాకతీయ’లో చోరీపై విచారణ



కళాశాలను పరిశీలిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

మాక్లూర్: మండలంలోని మాణిక్‌భండార్ వద్ద గల కాకతీయ మహిళా ఇంజినీరింగ్ కళాశాలను శుక్రవారం ఏసీపీ కిరణ్‌కుమార్ పరిశీలించారు. ఈ నెల 21న రాత్రి దొంగలు కాలేజీలోకి చొరబడి రూ.7.50 లక్షలను ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ విషయమై ఏసీపీ ఎస్సై యాదగిరిగౌడ్‌తో కలిసి కళాశాల ప్రాంగణంలో పరిశీలించారు. సెక్యూరిటీ, ఇతర సిబ్బందిని విచారించారు. డబ్బులు ఉన్నాయన్న విషయం బయటకు ఎలా తెలిసింది, తదితర అంశాలపై విచారిస్తున్నట్లు ఏసీపీ వెల్లడించారు. గత సంవత్సరం ముబారక్‌నగర్‌లోని శ్రీనిధి హాస్టల్‌పై నుంచి పడి బాలిక మృతి చెందింది.ఆ హాస్టల్‌ను కూడా ఏసీపీ పరిశీలించారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

మోపాల్: మండలంలోని ఒడ్డెరకాలనీ పంచాయతీకి చెందిన మల్లమ్మ (35) జీవితంపై విరక్తి చెంది గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మల్లమ్మ కూలీ పనులు చేసుకుని ఒంటరిగానే జీవనం సాగిస్తోంది. ఆమె భర్త పదేళ్ల క్రితం, కొడుకు సాయికుమార్ ఆరునెలల క్రితం చెరువులో పడి మృతిచెందారు. అప్పటి నుంచి బెంగతో ఒంటరిగా ఇంట్లోనే ఉంటుంది. ఒక్కగానొక్క కొడుకు మృతిచెందడంతో తీవ్ర మనస్తాపానికి గురై జీవితంపై విరక్తి చెంది గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మల్లమ్మ అక్క కొడుకు కృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యానికి బానిసై ఒకరు..

భిక్కనూరు: భిక్కనూరులోని బొబ్బిలి చెరువులో పడి ఒక్కరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపారు. గ్రామానికి చెందిన కమ్మరి శ్రీనివాస్ (40) తాగుడుకు బానిసై ఎలాంటి పని చేసేవాడు కాదు. అతని భార్య రజిత ఆరోగ్యం సరిగా లేకపోవడంతో తల్లి గారి గ్రామమైన చిట్టాపూర్‌కు 15 రోజుల కిందట వెళ్లింది. అప్పటి నుంచి శ్రీనివాస్ ఇంక ఎక్కువ తాగేవాడు. ఈ క్రమంలో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం చెరువులో మృతదేహం తేలడంతో పోలీసులు ఒడ్డుకు తీసుకువచ్చారు.మృతుడు కమ్మరి శ్రీనివాస్‌గా గుర్తించారు. ఆయనకు భార్య రజిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి సోదరుడు సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

కుటుంబ కలహాలతో యువకుడు..

ఎల్లారెడ్డి:మండలంలోని శివానగర్‌లో కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన చాకలి సాయిలు(38) కుటుంబ కలహాలతో తాగుడుకు బానిసై గురువారం రాత్రి పురుగుల మందు తాగాడు. ఆయనను కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి తరలించగా వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.